కథానిక:

# రామనాథాయ

శ్రీ అయపిళ్ల సత్యనారాయణమూర్తి

ఎవడో, ఎక్కడివాడో, రామనాథాయ, - నా తమ్ముడయి కూచున్నాడు!

రామనాథాయకూ, నాకూ, ఏకోశానా రక్తసంబంధం అంటూ లేదు చిన్నతనం నుండి ఎరిగివున్న స్నేహితుడన్నా కాదు ఏవిధంగా ముఖ్యస్తంగా గాని, పరోక్షంగా గాని నాకు నేనయి కలుగచేసుకున్న పరిచయమన్నా కాదు.

ఓనాడు మామూళ్ళు విడిచేసిం తర్వాత వొక్కణ్ణే తల వొంచుకు వచ్చేస్తున్నాను ఇంటికి రామనాథాయ కనిపించి, నమస్కారం "అన్నయ్యా" అని ఎంతో ఆత్రంగా పలకరించాడు అతడు రామనాథాయ అని నాకు అప్పటికి తెలియనే తెలియదు ఎవ్వరబ్బా ఈ అలభ్యసోదరుడు అని నేను తెల్లబోయి చూస్తున్నప్పుడు అతనే తిరిగి "నన్ను మరచారా, నేను - రా-మ-నా-థా-య-ను!" అన్నాడు తన పేరు నొక్కి-నొక్కి చెప్పుతుంటూ

నాకు ఈ మణ్మాత్రమయినా స్ఫురణకు రాలేదు నేను ఆ ముఖాన్నే యిదివరలో చూచినట్లు జ్ఞాపకంలేదు కాకపోయినా రామనాథాయనే వ్యక్తి నాస్మృతిపథంలోనే లేడు నేనేమీ ఎరగనండీ అని చెప్పేస్తే అతనేమయినా అనుకుంటాడని 'రామనాథాయనే పేరు ఎప్పుడో ఎక్కడో వినినట్టేవుంది కాని, అంత బాగా జ్ఞాపకానికి రావటంలేదు" అన్నాను

అతను తొందరగా, మీరు మరిచిపోయినట్టున్నారు నేను మీతమ్ముణ్ణి! రామనాథాయను! మీయింట అన్ని దినాలు వున్నాను!" . అని నాకళ్లల్లోకి వింతగా చూశాడు

అతను చెప్పిన విషయాలు నాకు సరిపడనందున అతడు ఈ విషయంలో తప్పకుండా పొరపడి వుంటాడని నేననుకున్నాను "క్షమించండి'నాకు ఏమీ జ్ఞాపకం రావడం లేదు" అన్నాను అతడు కొంచెం నిరుత్సాహపడి "పోనివ్వండి మీరు మా అగ్రహారం వేంచేశారు కదూ!" అని అడిగాడు

"ఏ అగ్రహారం అండీ?"

"మాముళ్లగ్రహారం"

"ఎక్కడ?"

"గోదావరిలో!"

ఈ విషయాలు నాకు మరీ అగమ్యగోచరంగా వున్నాయి "మాదంతా తూర్పుకోస్తా అండీ - నే నెప్పుడూ ఆకేసి వెళ్లివుండనే లేదండీ - మీరు నన్ను పొరపాటుగా భావించి వుంటారు" అని విడమర్చి చెప్పేశాను

అతనికింకా అనుమానం తీరలేదు కాబోలు "సూర్యప్రకాశరావు పంతులుగారు కదండీ తమరూ?" అని నన్ను ప్రశ్నించాడు, మిమ్మల్ని మీరేమరచారా అన్నట్టు నన్ను నాకు జ్ఞాపకంచేస్తూ.

మోరు ఓ ప్రక్కకు తిప్పి బహు వినయంగా "కాదండీ!" అని మనవిచేసుకున్నాను

అతడు పాపం చిన్నపుచ్చుకున్నాడు 'వాకే, మీ రనుకున్నాను సుమండీ ఎంత పోలిక తెచ్చిపెట్టాడు భగవంతుడు . క్షమించండి తమరు మరోలా "

"అచ్చే ఎంతమాటా ఇంతకూ మనుష్యులను పోలిన మనుష్యులుండటం సహజమే!"

అతడు ఆ తరువాత నాగురించి అన్నివిషయాలు సంగ్రహంగా కనుక్కున్నాడు ఎక్కడ నివసిస్తోన్నదీ ఏంచేస్తోన్నదీ.. అన్నీను.. ఆఖరున "క్షమించండి శ్రమ యిచ్చినందుకు శెలవయితే నే వెళతాను భగవంతు డనుగ్రహిస్తే తమదర్శనం తిరిగి చేసుకుంటాను" అని చెప్పి చక్కా పోయాడు.

నాకు అతనిమీద చాల జాలివేసింది అతనికి సూర్యప్రకాశరావుగారు ఎంత దగ్గరచుట్టమో ఏమో! మాటలనుబట్టి సూర్యప్రకాశరావుపంతులుగారు ఈయన్ను తమ్ముడిగా చూసుకున్నట్టువుంది పాపం అతనివల్ల, యితనికేం జరూరు పనులున్నాయో నాగురించి అన్ని విషయాలూ యితను కూలంకషంగా కనుక్కున్నాడు. కాని అతనిగురించి నేను ఒక్కవిషయమన్నా అడిగి తెలుసుకోలేదు! మనిషి మంచి మర్యాదస్తుడల్లె ఉన్నాడు. ఎంత



పొందిగ్గా మాట్లాడాడు! మరోసారి కనిపిస్తాడో, కనిపించడో పాపం! అనుకున్నాను

ఆమరునాడు శెలవ్ దినం అవటంవల్ల ఇంటివదనే కూచున్నాను. శెలవ్ దినం నాడే కాదు ఎప్పుడూ ఎచ్చటకూ నేను పోయి ఎరుగను స్కూలు పని చూచుకుని తిన్నగా దిక్కులు చూడకుండా ఇంటికి చేరడం మొదట్నుండీ కూడ నాకభ్యాసం! నేనేమీ యింటిపూచీ వహించనక్కరేదు అంతా మాఆవిడే చూచుకుంటుంది పాపం! ఇంటిగొడవ మాకెందుకని మీరనుకోవచ్చును అసలు కథతో అనుబంధముంది కాబట్టే! ఆమె కూరన్నా తేనీయదు నన్ను మీకెందుకండీ శ్రమ కాకపోయినా మీకు బేరసారాలు తెలీవాయెను కానీ పరకు అణాన్నరకు పడేయించుకుని వస్తారు" అంటుంది ఏది ఎలాగయినా నాకు ఇంటిపూచీలేదు అందువల్ల శెలవు దినంనాడు ఇంటివదనే కూచున్నాను కూర్చున్నానంటే ఊరుకే తమ్మన్నలాగ కూచోవడంకాదు ఆమె వంట ఆరంభించినప్పుడు నేను కబుర్లు చెప్పటం ఆరంభిస్తాను ఆమె కూరలు తరుగుతూన్నప్పుడు, నేను ఉరికే కబుర్లేకాకుండా చిక్కుడుకాయలయితే ఈనెలుతీసి ఇయ్యటమో బంగాళాదుంపలు వగయిరాలయితే పైన తోలువొలిచి యివ్వటమో చేస్తూవుంటాను ఆమె చారులో చింతపండు పపుసు పిసరు వెయ్యడానికిగ్గాని, లేక మరింకేదయినా పనిచేయటానిగ్గాని లేచివెడితే, కూడ నేనూ లేచి ఆమె వెనకాలే వెళ్లి ఆమె ఆపని ముగించగానే తిరిగి ఆమెముందు, నేను వెనుకగావచ్చి ఎవరిస్థలాల్లో వాళ్లం కూచుంటాము ఇది మొదట్నుంచీ ఇద్దరకూ అలవాటయిపోయింది నేనట్లా లేచి వెళ్లకపోతే నాకబుర్ల ధోరణిలో ఓపెట్టు ఉత్సాహం తగ్గిపోతుంది ఆమె వెనకాలగా నేను లేకపోతే ఆమె ఆకాస్తపని మరిచిపోయి తిరిగివచ్చి కూచుంటుంది అతరువాత చారులో చింతపండు పడకపోవటమో, కూరల్లోగాని, పప్పులోగాని ఉప్పు వెయ్యకపోవటమో, ఏదో అసంధర్భపు వంట తయ్యారయి కూచుంటుంది

ఆరోజు నేనట్లా కూచుని క్రితందినం రామనాధాయతో జరిగిన వృత్తాంతం జ్ఞాపకానికి రాగా, ఆసంగతి ఆమెతో చెప్పటానికి ఉపక్రమించబోతున్నాను

"మాస్టరుగారూ!" అన్న కేక వినిపించింది నేను లేచి వెళ్లి తలుపులు తెరిచాను ఎదురుగా రామనాధాయ

"నమస్కారమండీ" అన్నాడు

"నమస్తే రాండి" అన్నాను

అతడు లోనికివచ్చి కూచున్నాడు

"ఇవ్వాళ శెలవుదినం అవటంవల్ల తమరు ఇంటివద వుంటారనుకోలేదు" అన్నాడు

"మీరలా అనుకోడములో తప్పేమీ లేదు చిరాగ్గా వుండటంవల్ల ఎక్కడకూ వెళ్లటంలేదు"

"పోనివ్వండి మంచి పనేచేశారు అనవసరంగా తిరగటం అంత మంచిపని కాదు నిన్నను మిమ్మలను చూచాను తిరిగి తమర్ని దర్శించుకోవాలని బుద్ధి పుట్టింది మా అన్నయ్య శ్రీ సూర్యప్రకాశరావుగారు కనిపించినట్టే వున్నది తమ దర్శనభాగ్యం"

"ఎవ్వరండీ ఆపంతులుగారు!"

"వారండీ! వారు ఓతూరి మా గ్రామం వేంచేశారు నేనప్పుడక్కడ ఓ ట్రయినింగు స్కూల్లో మాస్టర్ని ఆయన నన్ను చూశారు ఏం అభిమానమో చెప్పలేను అదో పూర్వజన్మ సంబంధం అనుకుంటాను వారు నాగురించి అడిగి తెలుసుకుని తనతో వచ్చేయమన్నారు అంతే!- నేనేమీ ఎదురుజవాబు చెప్పలేదు వారి వెనువెంట నే బయల్దేరాను పట్టణం చేరుకున్నాం వారు పేరు కెక్కిన పెద్దప్లీడరుగారు చాలా భారీ అయిన పలుకుబడి



వారిది నాకు అక్కడ ఏమీ పనికూడ లేదు ఊరికే వారి వెంట కోర్టువరకూ వెళ్లటం తిరిగి వారి వెనువెంటనే యింటికి చేరుకొనటమున్నూ ఇంట్లో ఆయన తమ నౌకర్లతోను చాకర్లతోను చెప్పేశారు నన్ను చాల గౌరవంగా చూసుకోవలసిందని ఆ యిల్లాలు పాపం నన్ను తన తోబుట్టువల్లె చూచుకుంది రెండేళ్లపాటు జీవితం హాయిగా గడిచిపోయింది నన్నతడు తమ్ముడూ అని నోరార పిలిచేవాడు నాకు పాపం పెళ్లి చేయాలని తలపెట్టాడు కూడ"-రామనాథాయకళ్లు చెమ్మగిల్లాయి చేతి బొటనవ్రేలితో కనుఅయిమూలలో ఇముడుకుపోయిన నీటిబొట్టును పైకి విదలించి ఒక్క నిట్టూర్పు విడిచాడు

"పాపం ఎంత దయార్ద్ర హృదయుడు" అన్నాను

"మన కా అదృష్టం లేకపోయిందండీ"

నేనూహించుకున్నాను - సూర్యప్రకాశరావుగారు మరణించి వుంటారని - కాని అంతలోనే తిరిగి అనుకున్నాను ఆయన మరణించి వుండడం అసంభవం ఆయన మరణించేవుంటే పక్షంలో అతని గురించి ఇతను వెదకటానికి బయల్దేరడు ఇంతకూ ఈ ఆసామికి అదృష్టం లేకపోవడంలో అసలు విషయం వివాహం తప్పిపోవడం కాబట్టి - అదే విషయాన్ని ఆయన్ను అడిగాను 'పాపం! మీ పెళ్ళి ఆగిపోయింది గావాల?'

"నా పెళ్లి ఆగిపోవడముతో ఊరుకున్నా బాగుండునండీ నన్ను తోబుట్టువల్లే చూచుకుంటూన్న ఆయనగారి భార్య హఠాత్తుగా 'హరి'మంది ఆమె మరణించటం - ఆయనగారు నాకోసం ఖాయపరచిన సుముహూర్త, శుభలగ్నాన, ఓ పదహారేళ్ల పడుచు మెడలో పుస్తె కట్టేయటం జరిగిపోయినయ్ ఆమెగారు ఇంట్లో అడుగుపెట్టడమేమిటి, నాకు ఉద్వాసన చెప్పడమేమిటి రెండూ ఒక్కసారి జరిగినయ్ ప్లీడరు సూర్యప్రకాశరావు అన్నయ్యగారు నన్ను చాటుగా తీసికెళ్లి ఎంతని ఏడిచారు! "తమ్ముడూ! ఎప్పుడయినా భగవంతుడనుగ్రహిస్తే తిరిగి కలుసుకుందాం అని నన్ను కౌగలించుకుని ఎంత వద్దంటూన్నా వినకుండా చేతిలో వందరూపాయలుంచాడు మాఊరు పోయాను అయిదు సంవత్సరాలు ఎలాగో గడిపాను ఆ తరువాత ఉండటానికి మనస్సు నిలిచింది కాదు సూర్యప్రకాశరావు అన్నయ్యగారికోరకు వారి ఊరు వెళ్లాను కాని వారక్కడ లేరు కుటుంబంతోకూడ ఎక్కడకో వెళ్లిపోయారట - ప్రాక్టీసు ఎత్తికట్టి నేను వెళ్లిపోయిన కొన్ని దినాలవరకూ ఆయన నిద్రాహారాలు మానుకున్నారట నన్ను తోబుట్టువకన్నా ఆదరంగా పెంచిన నా అన్నయ్యను అన్వేషిస్తూ ఇల్లా పిచ్చివాడల్లే తిరుగుతున్నాను మీలో మా అన్నయ్య దర్శనమిచ్చాడు-మీరూపంలో, మాటల్లో, చేతల్లో నా అన్నయ్య సూర్యప్రకాశరావుగారే నాకు తిరిగితిరిగి కనబడుతున్నారు మీరు నా అన్నయ్యగారే! మిమ్మల్ని నేను విడవను మీ పాదాలదగ్గర పడివుంటాను మీ సేవ చేసుకుని నా శేష జీవితాన్ని గడుపుకుంటాను నా అన్నయ్యా! నన్ను రక్షించవూ!" అని రామనాథాయ నా పాదాలమీదపడి వెక్కివెక్కి ఏడిచాడు రోదనపెట్టాడు నా హృదయం నీరయ్యింది ఒక్క నిముషం చైతన్యం తప్పినంత పనయ్యింది ఇంత అకస్మాత్తుగా అతడీ పనికి దిగుతాడని నేను అనుకోలేదు కడకు ఊహించనన్నా లేదు ఏమని చెప్పటానికిగాని, చెయ్యటానికిగాని నాకు శక్యం కాలేదు ఇదివరలో ఎప్పుడూ ఇటువంటి విషమ పరిస్థితి నాకు కలుగలేదు ఎప్పుడయినా దిటవుగా కోపంవచ్చినప్పుడు పిల్లలమీద చేయి ఎత్తబోతే - "మాస్టరుగారూ కొట్టకండీ! మీకు నమస్కారమండీ," అని పాదాల మీద పడతారు వెంటనే ఎత్తినచేతిని దింపేసి వాళ్లను పొమ్మనటంమట్టుకే ఎరుగుదును

ఏం చెప్పటానికి, ఏం చెయ్యటానికీ తోచక 'ఎబ్బే-లేవండీ- అదేమిటి " అనేసి వంటింటివైపు నడిచివెళ్లాను సలహా కోరేందుకు

"సరళా! ఇట్లారా మాట!" అన్నాను

ఆమెవచ్చి నించుంది అతడి వృత్తాంతం ఎక్కడ మొదలుపెట్టాలో, ఎలా అంతం చేయాలో ఆమెకు చెప్పటానికి ఎలా వీలు కలుగుతుందో అని తికమకలు పడుతూండగానే—

ఆమె నాజేవురించిన మొహంలోకి చూస్తో - "హుఁ విన్నానంతాను బాగానే వున్నది ఇంకేం-మీకు మంచి తమ్ముడే దొరికాడు! అన్నది

"ఏం చేయమంటావు?"

"మీ ఇష్టం!"

"రెండు దినాలుండి పోతాడు"

"మీ ఇష్టం అన్నాను కదూ!"

ఎవడో, ఎక్కడివాడో, రామనాథాయ!-నాకు తమ్ముడయి కూచున్నాడు!

రెండు రోజులు కాదు రెండు నెలలాయ రామనాథాయ నాపంక్తి భోజనం రెండు పూటలా ఆరగిస్తున్నాడు! అతను నన్ను అన్నయ్యగారనే పిలుస్తాడు నేను మట్టుకు 'రామనాథాయ'అనే పిలుస్తున్నాను

రామనాథాయ ఓ విచిత్రమయిన వ్యక్తిగా మారాడు నేను స్కూలుకు పోతున్నప్పుడు, నాతో స్కూలువరకూ వచ్చి నన్ను అంపకం పెట్టిపోతాడు తిరిగి స్కూలు విడిచేవేళకు వచ్చి నన్ను కలుసుకుని నా వెనకాలనే ఇంటకి చేరుకుంటాడు దారిలో ఇంటకి కావలసిన సామానులు కూరలు కొని పట్టుకుంటాడు నాకు ఒడిగి పొదిగి నడుస్తాడు

ఒకనాడు బజారులో నన్ను నిలుచుండబెట్టి - తనుపోయి ఒక జత చెప్పు జోళ్లు చేతితో పట్టుకొచ్చి "అన్నయ్యా యివి మీరు తొడిగి చూడండి"అన్నాడు అంతవరకూ నాకు కాలిజోడు అవుసరమే లేకపోయింది తొడగి చూచాను సరిపోయినవి "అందరుయిన జోడు కాలికి సరిపోయింది ఇవి మీరు వుంచండి" అని బలవతంమీద ఒప్పించాడు నన్ను

రామనాథాయ అన్ని పనులూ బాగానే వున్నయిగాని ఇంట్లో ఓ పెద్ద చిక్కు తెచ్చిపెట్టాడు

ఈ కరువు దినాల్లో అతను ఓ బరువు అని గాని, లేక పనిపాట్లుచేయలేక మా ఆవిడ కష్టపడుతున్నదనే విచారంగాని ఏమీ నేను భావించడములేదు ఎందువల్లనంటే రామనాథాయ పైన నాకెంత సహాయకారిగా వుంటున్నాడో ఇంటవద్ద సరళకు అంత సహాయకారిగానే వుంటున్నాడు సరళను ఎప్పుడూ "ఒదినా!" అని పిలుస్తాడు ఆమె మట్టుకు రామనాథాయ అనే పిలుస్తుంది ఇంటివద్దప నీరంతటనీ పైన పైపువద్దకు పోయి తెస్తాడు బజారుకుపోయి ఇంటకి కావలసిన సమస్తమయిన సరుకులూ తెస్తాడు కూరలు తరుగుతాడు ముఖ్యంగా - దర ఖాస్తు, మంజూరులేని మా ఆవిడ నెలవారి మూడురోజుల శెలవుల్లోనూ, నా చెయ్యి కాల్చుకోకుండా తనే నడుంకట్టి ఆలోటు కించిత్తయినా లేకుండా చేస్తున్నాడు!

చిక్కు ఎక్కడ అంటె - ఎప్పుడూ నన్ను ఎడమరిచి ఎరుగని ఇల్లాలుకూ నాకూ పగటిపూట తెగుదంపులు చేసేశాడు

నేను ఇదివరకటల్లే ఎప్పుడయినా వంటయింటివయిపు వెళ్లబోతే - మీ కెందుకం శ్రమ పోయి గదిలో చల్లగా కూచోండి అంటుంది సరళ 'అవు నన్నయ్యగారూ'

(38-వ పేజీ చూడండి)

# రామనాథాయ

(18-వ పేజీ తరువాయి)

అని తాళం వేస్తాడు తమ్ముడు రామనాథయ!

ఈ విషయంలోమటుకు, రామనాథాయ రామనాథాయలా గాక లక్షింపతిఅయి కూచున్నాడు!

ఈ అర్ధంకు తీర్చుకుందికి రామనాథాయకు ఏదయినా పని కల్పించాలని విశ్వ ప్రయత్నం చేశాను లాభం లేకపోయింది బ్రహ్మాండంపైని రెండు 'ట్యూషను'లు ఏర్పాటు చేశాను ఉదయాన కూరలకు పోయినప్పుడే ఆ రెండు ట్యూషనులు చెప్పేసి ఇంటికి చక్కా వచ్చేస్తున్నాడు

మంచిచిక్కే తెచ్చిపెట్టాడు రామనాథాయ బడివిడిచి వచ్చింతర్వాత యింటి వద్ద నకేమీ తోచకుండా వున్నది ఎక్కడికయినా పోయే అలవాటు మొదట్నుండీ లేదాయను

పరిస్థితు లెలా వున్నా రామనాథాయను పొమ్మనలేకపోయాను ఇంతకూ, రామనాథాయ మా ఇంట వుండటం ఏవిధమయిన ఇతర ఇబ్బందులూ లేవు నాకు కాలక్షేపం కాకుండా వుండటం తప్పిస్తే!- రామనాథాయతో ఈ విషయాన్ని కదిపాను దానికి రామనాథాయ "మీకు కాలక్షేపం అయేందుకు నేను ఏర్పాటులను చేస్తాను లెండి" అని భరువసా ఇచ్చాడు

మరునాడు స్కూలునుండి తిరిగి వచ్చింతరువాత జేబులోనుండి 'పేక' తీసి పైన పెట్టాడు "రండి ఆడుకుందాం"—

"మన ఇద్దరమూనా?"

"ఒక్క పదినిముషాలవరకు మన యిద్దరమూను"

"ఆ తరువాత?"

"చూస్తారుకదూ!"

ఇద్దరమూ, ఆటకు కూచున్నాం పది నిముషాలన్నా కావడంలేదు ఇంటిప్రక్క గుమాస్తా, సోమసుందరముగారు వచ్చారు మరొక్క రెండు నిముషాల్లో నే ఆ ప్రక్కవీధిలో వుంటూన్న ప్లీడరు, వరాంకుశంగారు వేంచేశారు ఆ తరువాత పురోహితుడు, పాపన్నగారు వచ్చారు వచ్చిన వొక్కరినీ రామనాథాయ నాకు పరిచయంచేసి, ఆదరించి, చాపలు పరిచి వారిని కూచుండబెట్టినాడు మేము ఆట ప్రారంభించినాము రామనాథాయ ఆటలో పాల్గొనలేదు అవుసరం వొచ్చినప్పుడు మంచి తీర్థం వగయిరాను ఇచ్చి తిరిగి వెళ్లిపోతున్నాడు

రాత్రి ఎనిమిదిగంటలకు ఆట ముగించాము ఎవరిమానాన వారు వెళ్లిపోయినారు రామనాథాయను పిల్చి అడిగాను వీ రెందుకు వచ్చారని "నిన్నను మీరు చెప్పారు కదూ కాలక్షేపం అవటంలేదని వీరందరూ ప్రతిదినమూ ఒకచోట కూచుని ఆడుతున్న వాళ్లే - మనింటికి ఆహ్వానించాను! మరో చెయ్యికూడ వాళ్లకు కలిసివచ్చింది

రామనాథాయ సంగతి నాకు మహా ఆశ్చర్యం కలిగించింది అతని కలుపుగోరుతనం, ఇతరుల్తో, స్నేహాన్ని అలవర్చుకోవటం నాకో విధమయిన మార్గదర్శకాలయినవి

ప్రతి దినమూ నేను స్కూలునుండి ఇంటికి వచ్చేయగానే చాపలు సిద్ధంగా పరిచి వుంటున్నై ఒకొక్కప్పుడు నేను వచ్చేసరికే పురోహితుడుగారు ఓ తెలుగు పేపరు, ఆంధ్రపత్రిక - ప్లీడరుగారు ఓ ఇంగ్లీషు పేపరూ పట్టుకుని వచ్చి మా అరుగుమీద కూచుని ప్రపంచ చరిత్రమీద తర్జనభర్జనలు చేస్తూంటారు

వీరివి రెండూ ఉత్తర దక్షిణ ముఖాలుగా పట్టిపోయే భిన్నమయిన దృక్పథాలు ఒకరు అమెరికా జాతీయతనూ, మరొకరు రష్యను జాతీయతనూ వకాల్తాలు పుచ్చుకుని వాదనలు సాగిస్తారు

పురోహితుడుగారు అనర్గళమయిన తెలుగుభాష, సంస్కృతపద సమ్మేళనతో వాడతారు ప్లీడరుగారు అంత తీవ్రతరంగా మాట్లాడలేరు గాని 'క్రాసింగ్సు' చేస్తూ పోతూంటారు

వారి దృక్పథాలు విదేశాంగ రాజనీతిలో ఎంత భిన్నాకృతి పొందినా అసలు వ్యవహారములో దిగబోయేసరికి ఏకత్వానికి వస్తారు పేకముక్కల్లో గల రాజనీతే అది!

ఏ ఫైరెండు పేకముక్కలూ, ఏ ఫైరెండు రాజ్యాల సమైక్యత అంటారు ప్లీడరు దీనికి ఔనండీ అని పురోహితుడుగారు తాళం వేస్తారు!

రాన, రాను పేకాట ముగించటం రాత్రి పదకొండు పన్నెండూ కావస్తోంది

ఇప్పుడు, యితర్ల ఇళ్లకు వెళ్లటం నాకు అభ్యాసమయ్యింది కూడ స్కూలు విడిచేసింతర్వాత దారిలోగల ప్లీడరుగారింటికి పోయి వారిని ఓ కేక వెయ్యటం - వారు గాని అప్పటికి మా యింటికి వెళ్లకుండా వుంటే - వారి ఇంట ఓ కప్పు కాఫీ సేవించి ఇద్దరమూ కలిసి మా యింటికి రావటం మామూలు కార్యక్రమం యథా తథంగా అమలు జరపటం రాను, రాను చేతులు హెచ్చుతున్నవి నలుగురమల్లా ఆరుగురం, తరువాత ఎనమండుగురమూ, ఆ తరువాత పది, పన్నెండు వరకూ సంఖ్య పెరిగింది అందువల్ల రెండు 'బ్యాచీలు' క్రింద విడిపోయినాము

నాకు స్నేహితులు హెచ్చయినారు ఎన్నడూ ఇదివరకు పొరుగుమనిషింటికయినా పోయి ఎరుగని నాకు ప్రతిదినమూ, ఏదో ఒక స్నేహితుని ఇంటినుండి విందుకు ఆహ్వానము!

ఇంతే కాదు నే నెంతో మంచివాడనని - సత్యహరిశ్చంద్రు డంతటివాడనని చాల గౌరవమయిన పెద్ద మనిషి నని పేరు పడిపోయింది ఏ విందుకయినా మొదటి తాంబూలం నాదే ఇది నాకు మొదట్లో చాల చిన్నతనంగా వుండేది

ఇంతకూ కారణం రామనాథాయ! రామనాథాయ నా గురించి ఇతర్లవద్ద పొగడ్తే దీనికి కారణం మాటల సందర్భ



మేలో ఓనాడు ప్లీడరుగారు "మీ తమ్ముడు రామనాథాయ ఎంత ఉత్తముడండీ అటువంటి తమ్ముడుండటం అదృష్టం మీదే! " అన్నారు

నేను నవ్వేసి ఊరుకున్నాను

"మీ తమ్ముని వయస్సు ముదురుతోంది కదా వివాహం తలపెట్టారా?" అని ప్రశ్నించారు

ఈ ప్రశ్న నన్ను కత్తితో పొడిచినంత పనయ్యింది నాకు రామనాథాయ మొదటి అన్నయ్య సూర్యప్రకాశరావు పంతులు గుర్తుకు వచ్చారు వారు ఇతనికి వివాహం తలపెట్టడం అతని ఇల్లాలు పోవడం !— తిరిగిఅదే పరిస్థితిలో నేనూచిక్కుపడ్డాను

ప్లీడరుగారితో, రామనాథాయ నాకు అసలు తమ్ముడు కాదనీ అసలు విషయాన్ని తెలియచేశాను "పోనివ్వండి దానికేం ఎన్నాళ్లని మీ ఇంట వుంచుకుంటారు బెండకాయ ముదిరినా, బ్రహ్మచారి ముదిరినా మంచిది కాదట ఏదో మీ పాదాలపడ్డ మనిషి ఓ ఇంటివాణ్ని చేసి మీ పూచీ తీర్చుకోండి" అన్నారు

"నాకేమీ తెలియదండీ ఏం చెయటం!" అని నసిగాను

మీకేమీ బాధలేదు మీచేతంట దమ్మిడీ పడకండా నేను ఆ భారం వహిస్తాను" అన్నారు ప్లీడరగారు!

అంతకన్నా ఏంకావాలి నాకు! రామనాథాయ ఓ యింటివాడవుతాడు పోతే సూర్యప్రకాశరావుగారు చేయలేని పని నేను పూర్తిచేశేననే గౌరవం నాకు నిలబడుతుంది!

వారంరోజులు చందాలు వసూలుచేసి అయిదువందల రూపాయిలు జమచేశారు ప్లీడరుగారు వధువు మినహా యేర్పాటులన్నీ జరిగినయ్

పురోహితుడుగారు ఆ పూచీ తనమీద వేసుకుని ఏరోజు కారోజు ఆడపిల్లలు గురించి, మాకు తెలియచేస్తూనే వున్నారు ఏ ఒక్కరూ పిల్లను యిస్తామని ముందుకు రావడంలేదు శాఖాభేదాలు విడిచిపెట్టి బ్రాహ్మణపిల్లవుతే చాలుచేసుకుందికే పురోహితుడుగారి ప్రయత్నాలన్నీనూ

రామనాథాయ పైన మగవాళ్లతో ఎంత చనువుగా తిరుగుతాడో, ఇళ్లల్లో ఆడవాళ్లతో కూడ అంత చనువుగా నేతిరుగుతాడు

అదే అతని మాటకారితనంలో వున్న చమత్కృతి! అందరిని వరుసవరుసన, వావి కలిపించుకుని పేరుపేరున పిలుస్తాడు అతనితో సమానమయిన వయస్సుకలవాళ్లూ అంతకన్న తగుమాత్రం చిన్నవాళ్లూ అతని మరదళ్లు! వయస్సు కాస్త హెచ్చిన వాళ్లు, ఒదినలూ, అక్కయ్యలూను. చిన్నపిల్లలు చెల్లెళ్లు!

ఒకే ఒక కుటుంబంలో చిన్నపిల్ల అతని చెల్లి వయసొచ్చిన ఆ పిల్ల అక్కయ్య అతని మరదలు

అయినా రామనాథాయగురించి ఎవరూ కుంచేగాని చెడుగు చెప్పుకోరు

గంటె తిప్పటంలో అతనిది అందవేసిన చెయ్యి అతను చేసిన వంటకాలన్నీ నలభీమపాకాలు! ఎవరింట్లో విందులన్నా రామనాథాయ వెళ్లిపడతాడు కానీ అయినా పుచ్చుకోని వంటబ్రాహ్మడు! ఆ ఇంటో నలుగురైదుగురు ఆడాళ్లనీ తీసుకుని, వారి చేతిసాయంతో పదికుంచాల బియ్యాన్ని ఎడంచేత్తో వారుస్తాడు

పురోహితుడుగారు తనపనిలో కృతకృత్యులయ్యారు ఓ గౌరవకుటుంబంలో, తండ్రి పోయిన ఓ పిల్లను కుదుర్చుకుని వచ్చాడు

రామనాథాయతో ఈ విషయము చెప్పి పిల్లను చూసుకుంటావా అని అడిగాను

రామనాథాయ రెండో తూరి నా పాదాలు పట్టుకున్నాడు మీరు నా అన్నయ్యలే కాదు నా ప్రత్యక్ష దైవస్వరూపులు మీరు కుదిర్చింది నే కాదంటానా అంతా మీ ఇష్టమే! అన్నాడు

వివాహం నిశ్చయమై పోయింది ముహూర్తం నాలుగు రోజుల్లోనే వుంది పెళ్లి ప్రయత్నాలు అంత అట్టహాసంగా లేకపోయినా, ఓమాదిరీగానే జరుగుతున్నవి

ప్లీడరుగారికి ఇద్దరే కుమాళ్లు కూతుళ్లు లేరు అందువల్ల కన్యాదాతగా ఆయన్నే ఒప్పించాము ప్లీడరుగారూ నేను వియ్యంకుళ్లము!

మరునాడు పెళ్లి !

తెల్లవారింది రామనాథాయ కనిపించలేదు! ఎక్కడ చూచినా, విన్నా ఇదే గొడవ! స్టేషనుకు మనుషులను పంపాము పోలీసురిపోర్టు యిచ్చాము అంతు చిక్కలేదు ఉదయం పదిగంటలు కూడ దాటింది ముహూర్తం టైము దాటిపోయింది రామనాథాయ కనిపించలేదు

రామనాథాయతోపాటు, పూటకూళ్ల హోటలు వెంకుసుబ్బమ్మగారి పాతికేళ్ల విధవ కుమార్తెకూడ మాయమయ్యింది - పదిహేను తులాల బంగారంతోకూడ!

ప్లీడరు పరాంకుశం పంతులుగారు నా చెవిలో చెప్పారు కద - ఆ క్రితం సాయంత్రం రామనాథాయ మూడువందలు అడిగినాడట తన బట్టలు వగైరాల ఖర్చుకు చందావసూళ్ల సొమ్ములోది తీసి అతని కిచ్చినారట

"ఎంత 'లుచ్ఛా' అండి!"

"ఏమిటి చేస్తాం మనవాడు కనకనా మన పరువు దిగడిందని ఏడిఏందుకు ఎలా వచ్చాడో అలాగేపోయాడు!" అన్నారు ప్లీడరుగారు

"ఎక్కడకు పోయుంటాడండీ!"

"మరో, మీలాటి, అన్నయ్యను వెతుక్కోనేందుకు!"

"ఎక్కడివాడండీ ఈ రామనాథాయ!" అని అడిగాను పురోహితుడు

"పల్లెకాట్లో వాడు!" అని గొణిగారు ప్లీడరు ★

# గ్రంథసమీక్ష

## చక్ర [CHAKRA]

ఆంగ్ల త్రైమాసిక పత్రిక

సంపాదకురాలు మా గ్రెల్లా హోర్డి
*Author's and Artists Associatıcıı, 16, Brandson's Gardens st, Kılpal, Madras 10* వెల 12 అణాలు

ఇది భారతీయ సారస్వత వ్యాసంగం ఆంగ్లభాషాభిమానుల కందించాలనే ఉద్దేశంతో రచయితల పరస్పర సహకారంతో నడుపబడుతున్న ఆంగ్ల సారస్వత పత్రిక

దీనిలో డాక్టర్ పి వి పతి వ్రాసిన *An outlıne of Fılm Lıterature* అనే వ్యాసం ఫిల్ముల పై ఆంగ్లంలో బయలుదేరిన సారస్వతంపై సమగ్రమయిన సమీక్ష *Earl L Denman* వ్రాసిన *A Story of Mountaın Phıloscphy* అనే వ్యాసంలో రచయిత తమ అభిప్రాయం ఇంకా విస్తరిస్తే బాగుండేది శ్రీ భాగేశ్వర శర్మగారు వ్రాసిన *Page from A Sketch Book* లో రచన కొత్తదారులు తొక్కుతూ చాలా హృద్యంగా నడిచింది

ఖండకావ్యాలలో తారా అలీ బేగ్, శ్రీనివాస రాయప్రోల్, పి లాల్ గార్ల రచనలు ప్రశంసనీయంగా ఉన్నాయి ఎల్ యస్ రామామృతం తమిళ భాషనించి అనువదించిన *The offerıng* అనే కథ ఒక సూత్న ఫణితిలో నడిచింది గాని, కథారచనలో కొంత అస్పష్టత వచ్చింది

పేజీల చివర రామగోపాల్, భాగేశ్వర శర్మగార్ల పుటాంత చిత్రణాలు చక్కగా ఉన్నాయి

క్రౌను సైజులో 28 పేజీలే ఉన్నా, చేతితో తయారుచేసిన కాగితాలపై చక్కగా ముద్రింపబడిన 'చక్ర' సారస్వతాభిమానులందరు తప్పక ఆదరింపవలిసిన ఆంగ్ల పత్రిక ★